క్లుప్తంగా

రాష్ట్రస్థాయి అండర్-19 చెస్ పోటీలకు ఎంపిక



సెలక్షన్‌లలో ఎంపికైన విజేతలకు బహుమతులు అందచేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అనసూయ చెస్ అకాడమీలో రాష్ట్రస్థాయి అండర్ - 19 జూనియర్ బాలికల చెస్ ఛాంపియన్ షిప్ సెలక్షన్లు నిర్వహించారు. ఈ సెలక్షన్లలో టి సౌమ్యశ్రీ, పి యస్విత్ వర్మ, పి సహస్రవర్మ, జి కావ్య విజేతలుగా నిలిచారని చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, కోచ్ మాదాసు కిషోర్ తెలిపారు. వీరంతా జూన్ 15 నుంచి విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా విజ్ఞాన వేదిక సేవా సంస్థ అధ్యక్షుడు అల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ చదరంగం క్రీడపై మహిళలు, బాలికలు ఆసక్తి కనబర్చడం ఆనందదాయకమన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

కాళ్ల: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ బహుజన సంఘ వ్యవస్థాపకుడు సొదాదసి గంగయ్య తెలిపారు. కాళ్లకూరు గ్రామంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. జూన్ 6వ తేదీ మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి భీమవరం పట్టణంలో అంబేడ్కర్ చౌక్‌లో ఏర్పాటు చేసిన 10 అడుగుల కాంస్య విగ్రహావిష్కరణ మహోత్సవంను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కుల మతాలకు అతీతంగా, రాజకీయాలకు అతీతంగా అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మైలా శ్రీనివాస్, బుంగ ఆదాము, కొండా రాజేష్, రంజిత్,సందీప్ యోహోషువా, కన్నయ్య, మణిరాజు, యోహాను, శామ్యూల్, దానియేలు, తదితరులు పాల్గొన్నారు.


గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పెన్మెత్స శిరీష

కాళ్ల: అధికారులు ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ గ్రామాల్లో సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని కాళ్ల ఎంపీపీ పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు అన్నారు. కాళ్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పటిష్టంగా అమలు చేయాలన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపర్చడానికి కృషి చేయాలన్నారు. కాలువలకు నీరు విడుదల చేయగానే మంచినీటి చెరువులు పూర్తిస్థాయిలో నింపుకుని ప్రజలకు సురక్షిత తాగునీరు అందించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఎలక్ట్రికల్ ఏఈ రాంబాబు మాట్లాడుతూ మండలంలో ఉన్న జగనన్న కాలనీలకు విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. ఎంఈఓ రవీంద్ర మాట్లాడుతూ నాడు- నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాయన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం అందించే జగనన్న విద్యా కానుక కిట్లను పాఠశాలలు ప్రారంభించే నాటికి అందజేస్తామన్నారు.సమావేశంలో జడ్పీటీసీ పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఎంపీడీవో జి.స్వాతి, తహసీల్దారు టీఏ కృష్ణారావు, మండల స్థాయి అధికారులు, ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయంలో విద్యార్థుల పుస్తక పఠనం



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

సాక్షి, భీమవరం : పట్టణంలోని వైఎస్సార్ ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, నీతి కథలు చెప్పడం వంటివి నిర్వహించారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణపై పిల్లలకు అవగాహన కల్పించడానికి చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చదువరుల సంఘం అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం, చెరుకువాడ రంగసాయి, కలిగొట్ల గోపాలశర్మ, రామ నాగేశ్వరరావు, లక్ష్మి, పద్మ, గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లుగా.. అందరూ మెచ్చేలా..

డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు



ఉండి : యండగండిలో పార్టీ సంబరాల్లో పాల్గొన్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్



భీమవరం : విజయోత్సవ సంబరాల్లో వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న నేతలు

ఉండి: ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి తన నాలుగేళ్ల పాలనలో పార్టీలు, కులాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించి నవశకానికి నాంది పలికారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. ఉండి మండలం యండగండిలో మంగళవారం జగనన్న నాలుగేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కట్ చేసి ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు తదితర వైఎస్సార్‌సీపీ నాయకులకు తినిపించారు.అనంతరం పీవీఎల్ మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు విజయమిచ్చారన్నారు. ఇది ప్రజలు కోరుకున్న ప్రభుత్వమని అందుకు అనుగుణంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. ఎంతమంది ఆయనను అడ్డుకోవాలని చూసినా ప్రజల అండదండలే ఆయనకు ఈ విజయాన్ని ఇచ్చాయన్నారు. నమ్మకాన్ని వమ్ముచేయకుండా ఎన్నికల్లో చేసిన వాగ్దానాల్లో 99 శాతం నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు.అధికారం చేపట్టి నేటికి నాలుగేళ్లు పూర్తవుతున్న సీఎం జగన్‌పై ప్రజాభిమానం కొంచెం కూడతగ్గలేదన్నారు.అలాగే అధికారం దక్కిందికదా అని చంద్రబాబు మాదిరి ప్రజలను మోసం చేయలేదన్నారు.రాష్ట్ర ప్రజలంతా జగన్ వెంటే ఉన్నారని ప్రజలకు మంచి చేసిన జగన్‌ను వారెప్పుడూ మర్చిపోరన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు,వైస్ ఎంపీపీ దత్తాల సుజాతరాణి, రాష్ట్ర జానపద కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు,యండగండి సర్పంచ్ గోగులమండ చినకృష్ణమూర్తి, పేరిచెర్ల సూర్యనారాయణరాజు, గుండాబత్తుల సుబ్బారావు, ముదునూరి కొండరాజు, అంగర రాంబాబు, రాయి సతీష్, ముదునూరి సుబ్బరాజు, బాలం తులసీ, కడలి శ్రీనివాస్, బొక్కా శ్రీను, అల్లూరి రాంబాబు, గాంధీరాజు తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో సంబరాలు

సాక్షి, భీమవరం : రాష్ట్రంలో జగనన్న ప్రజాసంక్షేమ పాలన నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ క్యాంపు కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్లలో పేదల సొంతింటి కల నెరవేర్చడానికి 32 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలిచ్చి ఇల్లు నిర్మిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కరోనా సమయంలో సైతం సంక్షేమ పథకాలను ఒక్కటికూడా నిలిపివేయకుండా ఎంతో ధైర్యంగా ప్రభుత్వాన్ని ముందుకు నడిపించారని, వలంటరీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పాలనను ప్రజల ముంగిటకు తీసుకువెళ్లారన్నారు. దీంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ తట్టుకోలేక ప్రతిపక్షపార్టీలు అసత్యాలు ప్రచారం చేస్తున్నాయన్నారు. ప్రజల హృదయాల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్న జగన్‌ను ఏశక్తి అడ్డుకోలేదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఏఎస్ రాజు, చినిమిల్లి వెంకటరాయుడు, తోట భోగయ్య, గూడూరి ఉమాబాల, మానేపల్లి నాగన్న బాబు, కామన నాగేశ్వరరావు, కొట్టి కుటుంబరావు, గూడూరి ఓంకార్, కోడే యుగంధర్, గంటా సుందరకుమార్, పాలపర్తి జోనా, జంగం మాణిక్యాలరావు, గుంటి ప్రభు, చవ్వాకుల సత్యనారాయణ, అఫ్జల్ బాష ,షేక్ ఖాన్ ,కోమటి రాంబాబు, ఏపీఆర్ సభాపతి, శ్రీనివాస్ చౌదరి, ముత్యాల బుజ్జి, తిరుమణి ధనుంజయ, బోకూరి విజయరాజు, షేక్ అన్సారి, బొక్కా గోపి, జల్లా కొండయ్య, మతల కాశీ విశ్వేశ్వరరావు, మోటుపల్లి విశ్వేశ్వరరావు, కట్రెడ్డి వెంకటేశ్వరరావు, పెచ్చెట్టి ప్రసాద్, నందమూరి అంజనేయులు, కోళ్ల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ సేవలు వెలకట్టలేనివి



పాలకోడేరు : మోగల్లులో వలంటీర్లను సత్కరిస్తున్న పీవీఎల్



ఉండి : యండగండిలో వలంటీర్‌లను సత్కరిస్తున్న దృశ్యం



భీమవరం అర్బన్ : వెంపలో వలంటీర్‌లను సత్కరిస్తున్న దృశ్యం

పాలకోడేరు: వలంటీర్ అంటే స్వచ్ఛంద సేవకుడని, ఆ సేవకుడు చేసిన సేవలు వెలకట్టలేనివని, అలాంటి సేవకులకు ప్రభుత్వం గౌరవించడం కోసమే ఈ వలంటీర్‌కు వందనం కార్యక్రమని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు అన్నారు.మంగళవారం మోగల్లు గ్రామ వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వలంటీర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేయడం చారిత్రక అవసరమని ఆయన అన్నారు. పనిచేసే ముఖ్యమంత్రికి, పనిచేసే ప్రభుత్వానికి తోడుగా నిలవాలన్నారు. వలంటీర్ల తరఫున వలంటీర్ సాయి దుర్గ మాట్లాడుతూ మా ద్వారా సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందించడం చాలా సంతృప్తినిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు పెన్మత్స వెంకటరాజు, ఉప సర్పంచ్ పెన్మత్స సీతారామరాజు, ఎంపీటీసీలు కాటూరి శాంతకుమారి, పెన్మత్స వెంకటలక్ష్మి , షేక్ పాపా సాహెబ్,పెన్మత్స నాగ రామకృష్ణంరాజు, మంతెన బాపిరాజు, పిన్నమరాజు నాగరాజు, పంపన శ్రీను, వీరమల్లు అశోక్, దొడ్డా రంగారావు, బలే చిట్టిబాబు, చిల్లా రత్నరాజు, కోరుకొల్లు దాసు, ఆకుల రంగ, గోడి భూషణం , కోనాల ప్రకాష్ కడిమి కుమార్ రామాంజనేయ రాజు,కొరత్రూటి కొండ, నాయకులు కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు, భూపతి రాజు వంశీకృష్ణంరాజు, శివకోడు హనుమంతరావు, కటిక శ్రీదేవి, బొక్కా రాంబాబు, గునుపూడి పాండు రంగారావు, వైస్ ఎంపీపీ సోడదాశి, నరేష్ , పంచాయతీ కార్యదర్శి కే వెంకటరాజు , వెల్ఫేర్ అసిస్టెంట్లు లక్ష్మీ ప్రసన్న, వినోల, కార్యకర్తలు వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సంక్షేమ రథసారథులు.. వలంటీర్‌లు

ఉండి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదల సంక్షేమం కోసం చేపట్టిన పరిపాలనకు గ్రామ, వార్డు వలంటీర్‌లు సహకారులుగా నిలిచారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. మంగళవారం యండగండి గ్రామ సచివాలయం వద్ద మహదేవపట్నం, చిలుకూరు, యండగండి, పాందువ్వ, ఉణుదుర్రు గ్రామాలకు చెందిన 105 మందిని వలంటీర్‌లకు వందనం కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ గోగులమండ చినకృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించి, సత్కరించారు.ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ మాట్లాడుతూ పేదవారికి మంచి జరిగినా,మంచి చేయాలన్నా ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబుకు అస్సలు నచ్చదని విమర్శించారు.అందుకే రాష్ట్రంలో ఎంతో మంచి పాలన సాగుతుంటే కుయుక్తులతో అడ్డుకోవాలని చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జగ్గరాజు, ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, రాష్ట్ర డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, మండల పార్టీ అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు, వైస్ ఎంపీపీ దత్తాల సుజాతరాణి, ఉండి బ్యాంక్ అధ్యక్షుడు పేరిచెర్ల సూర్యనారాయణరాజు, ఉణుదుర్రు సర్పంచ్ పిన్నంరాజు నాగలక్ష్మి,ఎంపీటీసీ అల్లూరి మాధవి, కరణం త్రిమూర్తులు, కోఆప్షన్ ఈది జాన్సన్‌వెస్లీ, అల్లూరి రాంబాబు, ముదునూరి సుబ్బరాజు, బాలం తులసీ, కడలి శ్రీనివాస్, ఆర్‌కే తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అధికారంలోకి వస్తే వలంటీర్ వ్యవస్థ రద్దు

ఆకివీడు: కుట్రలు, కుతంత్రాలతో అధికారంలోకి రావాలని చూస్తున్న టీడీపీ నేత చంద్రబాబు అధికారం చేపట్టిన మరుక్షణమే వలంటీర్ల వ్యవస్థను రద్దు చేస్తారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. ఆకివీడు నగర పంచాయతీ పరిధిలోని ఐదు సచివాలయాల్లోని సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డు గ్రహీతలకు మంగళవారం స్థానిక రైస్ మిల్లర్స్ భవనంలో సత్కార సభ నిర్వహించారు. సభకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీవీఎల్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా గుర్తింపు పొంది, ప్రజలకు పారదర్శకంగా పథకాలు అందజేస్తున్న వలంటీర్ల వ్యవస్థ చంద్రబాబును వెన్నంటి పీడిస్తుందన్నారు. వలంటీర్ల వ్యవస్థతో జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు. నిస్వార్థ సేవలకు నిలువుటద్దంగా వలంటీర్లు పనిచేస్తున్నారని చెప్పారు. అవినీతికి తావులేకుండా, బంధుప్రీతికి, పార్టీరహితంగా సేవలందిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి మాట్లాడుతూ వలంటీర్లు సంక్షేమ సారథులని ప్రసంశించారు. ప్రభుత్వ పథకాలను అవినీతి లేకుండా అర్హులకు అందజేసే విధంగా కృషి చేస్తున్న వలంటీర్ల మనుగడ ఉండాలంటే మళ్లీ జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ జే.కృష్ణమోహన్, వైస్ చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పళ్లెం అరుణ కుమారి, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, శిరపు శ్రీనివాస్, మన్నే పోతరాజు, షేక్ హుస్సేన్, అంబటి రమేష్, ఎండీ. సిద్దిక్, తిప్పా దుర్గా భవానీ బొక్కా శ్రీను, అందేరాజబాబు, ఊడిగ శ్రీను, జోగి నాగరాజు, మోరా జ్యోతి, జామి శ్రీనివాస్, శ్రీహరి, కౌన్సిలర్లు మోటుపల్లి కుమారి, తిరుమారెడ్డి మాధవి, గేదల అప్పారావు, నిమ్మల నాగు, దొడ్డి జగదీష్, జాన్‌వెస్లీ, ఎండీ.జిక్కీ, గుండుగొలను సావిత్రి, పలువురు నాయకులు, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థతో ఇంటి ముంగిటకే సంక్షేమ ఫలాలు

భీమవరం అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థతో ప్రతి ఇంటి ముంగటకే సంక్షేమ ఫలాలు అందడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అల్లూరి కృష్ణంరాజు అన్నారు. వెంప గ్రామంలో మంగళవారం వలంటీర్‌కు వందనం కార్యక్రమంలో భాగంగా సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులతో వలంటీర్‌లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అల్లూరి కృష్ణంరాజు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి ప్రతి 50 కుటుంబాలకు వలంటీర్‌ను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించి అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు ఇంటి ముంగటకే అందిస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులు జన్మభూమి కమిటీలు చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా పనులయ్యేవి కాదన్నారు. వలంటీర్లు గౌరవ వేతనం తీసుకుంటూ లబ్ధిదారులకు సేవలు చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో సొసైటీ త్రి సభ్య కమిటీ చైర్మన్ కలిదిండి మురళీ కృష్ణంరాజు, కలిదిండి అప్పలరాజు, ఎంపీటీసీ చిలకపాటి కుమారి, కార్యదర్శి కృష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మతోన్మాద విధానాలను వ్యతిరేకించాలి



సీపీఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న తులసీదాస్

సాక్షి, భీమవరం : దేశంలో భారతీయ జనతాపార్టీ మతోన్మాద విధానాల్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బి.తులసీదాస్ అన్నారు. భీమవరం క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో మంగళవారం జిల్లా విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. విచ్చలవిడిగా పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను తగ్గిస్తానని చెప్పిన కేంద్ర ప్రభుత్వం నిత్యం ధరలను పెంచుకుంటూ పోతుందన్నారు. దేశంలో చాపకింద నీరులా మతతత్వాన్ని విస్తరిస్తోందని అన్ని రాజ్యాంగ వ్యవస్థల్లో, విశ్వ విద్యాలయాల్లో సంఘ్ భావజాలం కలిగిన వారిని నియమిస్తోందన్నారు. కార్మిక చట్టాల్ని నిర్వీర్యం చేస్తూ లేబర్ కోడ్లు తెచ్చారని వ్యవసాయానికి ఉరి వేసేలా నూతన వ్యవసాయ చట్టాలు తెచ్చారని తులసీదాస్ వాపోయారు. బీజేపీ పాలనలో దేశంలో ఎన్నడూ లేనివిధంగా నిరుద్యోగం పెరిగిందని ప్రభుత్వ రంగ సంస్థలు, ఓడరేవులు, విమానాశ్రయాలు, బీమా సంస్థలను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని దుయ్యబట్టారు. పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కును సైతం ప్రైవేటువరం చేయాలనుకుంటోందని, మనరాష్ట్రానికి ఇవ్వాల్సిన ప్రత్యేక హోదా, విభజన హామీలు, పోలవరం ప్రాజెక్ట్ నిధులు, పునరావాసం మొదలైన అన్ని విషయాల అమలులో కేంద్రం పూర్తిగా విఫలమైందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి బి బలరాం మాట్లాడుతూ జిల్లాలో చాలాచోట్ల ధాన్యం మాసూళ్ళు ఇంకా పూర్తి కాలేదని ఇళ్ల స్థలాల సమస్య నేటికీ పరిష్కారం కాలేదన్నారు. టిడ్కో ఇల్లు లబ్ధిదారులు అందరికీ అందేలా చూడాలని బలరాం డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జేఎన్‌వీ గోపాలన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీహెచ్ బాబురావు, కర్రి నాగేశ్వరరావు, పీవీ ప్రతాప్, బి.వాసుదేవరావు, కేతా గోపాలన్, కవురు పెద్దిరాజు, జె నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్య ప్రైవేటీకరణను ఏఐఎస్‌ఎఫ్ వ్యతిరేకించాలి



భీమవరంలో ఏఐఎస్‌ఎఫ్ శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

సాక్షి, భీమవరం : కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విద్యా ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయికరణ విధానాలకు వ్యతిరేకంగా ఏఐఎస్‌ఎఫ్ గట్టి పోరాటాలు నిర్వహించాల్సిన అవశ్యకవత ఉందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. భీమవరం ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోస్తా జిల్లాల విద్యా, వైజ్ఞానిక, రాజకీయ, సైద్ధాంతిక, శిక్షణా తరగతులు మంగళవారం ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా విద్యా ప్రైవేటీకరణ, కాషాయికరణకు ప్రభుత్వాలు ఆసక్తి చూపుతున్నాయని వాటిని తిప్పి కొట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం అమల్లోకి తెచ్చి విద్యను కాషాయికరణ చేయడానికి చూస్తుందని నాగేశ్వరరావు ఆరోపించారు. ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.శివారెడ్డి ఏఐఎస్‌ఎఫ్ భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ సుందర్, టి.అప్పలస్వామి, సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలకు ఐక్యపోరాటాలే శరణ్యం

సాక్షి, భీమవరం : కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వం రంగం ప్రైవేటీకరణ, కార్మిక చట్టాలను కాలరాయడం చేస్తోందని, వాటిని కాపాడుకోవడానికి ఐక్యపోరాటాలే శరణ్యమని సీఐటీయూ భీమవరం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు అన్నారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలో సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక ధరలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కలిపిండి సత్యనారాయణ, కె సోమేశ్వరరావు, ఎం.శివ, బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వీరవాసరం : సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం వీరవాసరంలో సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ దేశంలో వివిధ కార్మిక సంఘాల్ని ఏకం చేసి ఐక్య పోరాటాలు నిర్వహించడంలో సీఐటీయూ ముందు ఉందని అన్నారు. ఆ సంఘ మండల కార్యదర్శి పి నాగరత్నం, వివిధ సంఘాల నాయకులు కె.సత్తిబాబు, నిర్మల, సత్యవతి, అన్నపూర్ణ, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణరాజు

సాక్షి, భీమవరం: కేంద్ర ప్రభుత్వం గత తొమ్మిదేళ్లుగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పెద్ద ఎత్తున ప్రజల్లోనికి తీసుకువెళ్లడానికి నెల రోజుల పాటు ప్రత్యేక ప్రచార కార్యక్రమం చేపట్టినట్లు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేటుకూరి సూర్యనారాయణరాజు చెప్పారు. మంగళవారం భీమవరం యూత్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీతో కలసి ఆయన మాట్లాడారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రధాని నరేంద్రమోదీ పనిచేస్తున్నారన్నారు. దేశవ్యాప్తంగా ఎంతో అభివృద్ధిని సాధించడంతోపాటు కరోనా వైరస్ కాలం నుంచి పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్న ఘనత మోదీకే దక్కుతుందన్నారు. ప్రతి ఇంటికీ తాగునీరు, మరుగుదొడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోగా ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ ప్రాంతాల్లో 21 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో 9 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నట్లు సూర్యనారాయణరాజు చెప్పారు. ఎరువులకు పెద్ద మొత్తంలో సబ్సిడీ ఇస్తూ రైతులకు అండగా నిలుస్తున్నామని ఆయూష్మాన్ భారత్ పథకం ద్వారా రూ. 5 లక్షల వరకు ఉచితంగా వైద్యం పొందేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. విలేకర్ల సమావేశంలో పార్టీ నాయకులు పేరిచర్ల వెంకట శ్రీనివాసరాజు(సుభాష్), కాయిత సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

3న ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జాబ్ డ్రైవ్

సాక్షి, భీమవరం : నేషనల్ కెరియర్ సర్వీస్ ఆధ్వర్యంలో భీమవరం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జూన్ 3వ తేదిన జాబ్‌డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి శ్రీనివాసరాజు, జిల్లా ఉపాధిఅధికారి సి మధుసూదనరావు మంగళవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌డ్రైవ్‌లో హీరో మోటార్‌కార్ప్, సీఈటీసీ సోలార్, కుశలవ హోండ్ వంటి కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. ఇంటర్మీడియెట్, డిగ్రీ, ఐటీఐ, బీటెక్ (మెకానికల్) చేసిన యువతీ, యువకులు అర్హులని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు సెల్ 93935 75953 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

భారీ వృక్షాన్ని తొలగించరూ..



నేలకొరిగిన వృక్షం

పాలకోడేరు: నాలుగు రోజులు క్రితం వచ్చిన గాలి దుమ్ముకు మోగల్లు పంచాయతీ పరిధిలోని గుత్తుల వారిపాలెం రహదారిలో కాడ మల్లి భారీ వృక్షం నేలకొరిగింది.రెండు విద్యుత్ స్తంభాలు పడిపోయాయి.దాంతో రాకపోకలు స్తంభించాయి. అయితే విద్యుత్ అధికారులు రెండు రోజుల క్రితమే స్తంభాలను తొలగించారు. కానీ సంబంధిత అధికారులెవరూ ఇంతవరకు భారీ వృక్షాన్ని తొలగించలేదు దీంతో ప్రజలు ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారు.

ఆకివీడులో భారీ వర్షం

ఆకివీడు: మండలంలో మంగళవారం మధ్యాహ్నం ఆకస్మికంగా భారీ వర్షం కురిసింది. కుండపోతగా కురిసిన వర్షానికి జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో దద్దరిల్లింది. కుండపోత వర్షానికి పలు చోట్ల రోడ్లు జలమయమయ్యాయి. భారీ వర్షానికి, పిడుగు శబ్దాలకు విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈదురు గాలులు, భారీ వర్షాలకు చెట్లు కూలి విద్యుత్ స్తంభాలు, తీగలు తెగిపడడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

వీరవాసరం: బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి.రమేష్ మంగళవారం తెలిపారు. పెద్దిపాలెం గ్రామానికి చెందిన మైనర్ బాలిక ఈనెల 28వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని బాలిక తండ్రి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ఉండి మండలం వాండ్రం గ్రామానికి చెందిన 21 ఏళ్ల యువతి 30వ తేదీ ఉదయం 5.30 గంటల నుంచి కనిపించడం లేదని చుట్టుపక్కల వెదకిన ఆచూకీ లభించకపోవడంతో యువతి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగాధరరావు తెలిపారు.